సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ఉపాధిలో వంద శాతం సాధించకపోతే చర్యలు

- డిసెంబర్ 15 నాటికి 17 వేల ఇళ్లు పూర్తి కావాలి - కులగణనను సమర్థవంతంగా చేపట్టాలి - కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో ఉపాధి హామీ చట్టం అమలులో లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నారని, సోమవారం నాటికి ఉపాధి హామీలో వంద శాతం లక్ష్యాన్ని సాధించక పోతే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపిడిఒలను హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల ఇంజినీర్లు, హౌసింగ్ కాంట్రాక్టర్లలతో ఉపాధి హామీ, హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఆడుదాం ఆంధ్ర తదితర అభివృద్ధి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా మొత్తం 25 లక్షల జనాభాలో 60 వేల మందికి పని కల్పించలేమా అని కలెక్టర్ ప్రశ్నించారు. వలసలను పూర్తిగా ఆపలేకపోవచ్చు... కానీ కొంతమందికైనా పని కల్పించాలి కదా అని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వలసలు వెళ్తున్న మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల్లో 60 శాతం మాత్రమే పనులు కల్పించడం ఏమిటని కలెక్టర్ ఎంపిడిఒలను నిలదీశారు. వలస వెళ్లాల్సిన అవసరం లేదని, ఊళ్లోనే పనులు కల్పిస్తామని కొంతమందికి అయినా భరోసా కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ కుటుంబాలకు పనుల కల్పన అంశంలో కూడా వెనుకబడి ఉన్నామని, మూడు, నాలుగు గ్రామాల్లో జీరో ఉందని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఒలను

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రశ్నించారు. 150 పని దినాలకు అనుమతి వచ్చే అవకాశం ఉన్నందున, అందుకనుగుణంగా ప్రణాళిక రూపొందించుకుని పని కల్పించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 30 నాటికి పెండింగ్‌లో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 15 నాటికి 17 వేల ఇళ్లు పూర్తి కావాలన్నారు. జిల్లాలో త్వరలో నిర్వహించనున్న కులగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. కులగణన వివరాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించిందని, ఈ అంశంపై మండలాల్లో త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాస్ట్ సర్టిఫికెట్లు, ఉద్యోగాలు తదితర అంశాలకు ఈ కార్యక్రమానికి ఏమీ సంబంధం ఉండదని, సమాచారం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి వచ్చే చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నాటికి 51 ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను పూర్తి చేసి స్వాధీనం చేస్తామని చెప్పామని, ఆ మేరకు అన్నీ పూర్తి చేసి స్వాధీనం చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి తల్లి, విద్యార్థికి కలిపి చేయాల్సిన జాయింట్ అకౌంట్‌లు 20 వేలకు గాను ఇంత వరకు కేవలం 3 వేలు మాత్రమే ఓపెన్ చేశారని, కోడుమూరు, ఆదోని, పత్తికొండ, ఓర్వకల్లు, మద్దికెర మండలాల్లో చాలా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్‌తో బ్యాంక్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించి జాయింట్ అకౌంట్‌లు త్వరగా ఓపెన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రతి సచివాలయం పరిధిలో కచ్చితంగా జరగాలని తెలిపారు. స్పందనలో పంచాయతీ రాజ్ శాఖలో ఎక్కువ కేసులు రీ ఓపెన్ అవుతున్నాయని, అసంతృప్తి ఎక్కువగా ఉందని, గడువులోపు నాణ్యతగా, అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని కలెక్టర్ ఇఒఆర్‌డిలను ఆదేశించారు. డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, హౌసింగ్ ఇన్‌ఛార్జీ పీడీ సిద్ధలింగమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి డిఎంకు మౌలిక వసతులు

- కలెక్టర్ డాక్టర్ సృజన - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీసీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగన్నాథగట్టు పై ఉన్న ట్రిపుల్ ఐటి డిఎం సంస్థకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రూ.3.72 కోట్ల ఖర్చుతో ప్రధాన రహదారి నుండి ట్రిపుల్‌ఐటీ డిఎం సంస్థ వరకు నిర్మిస్తున్న రహదారిని డిసెంబర్ నెల 15వ తేదీ లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.22 కోట్ల వ్యయంతో తాగు నీటికి సంబంధించి శాశ్వతమైన నీటి సరఫరా ఏర్పాటు చేస్తున్నామని,అప్పటి వరకు తాత్కాలికంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో బోర్ వెల్స్ తవ్విస్తున్నామన్నారు. సంస్థ భవన సముదాయం మీదుగా వెళ్లే హై టెన్షన్ విద్యుత్ లైన్లు మార్చేందుకు రూ.17 కోట్ల పనులకు రెండు మూడు రోజుల్లో ఆర్థిక శాఖ నుండి అనుమతులు వచ్చిన తరువాత విద్యుత్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించి రూ.12.4 కోట్లకు టెండర్లు ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా పిలిచామని, ఇవి త్వరలో ఫైనల్ అవుతాయని, ఆ వెంటనే పనులు చేస్తున్నామన్నారు. సమీక్ష సమావేశంలో ట్రిపుల్ ఐటిడిఎం డైరెక్టర్ సోమయాజులు, విజయానంద్ (కన్సల్ టెంట్ , ఐటిడిఎం), ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు, ఆర్‌బబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు, విద్యుత్ శాఖ ఎస్ఇ రామకృష్ణ, పంచాయతీ రాజ్ డిఇ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భూమి లేని నిరుపేదలకు భూహక్కు : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భూమి లేని నిరుపేదలకు భూహక్కు కల్పించే దిశగా భూపట్టాలు పంపిణీ చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి బాపట్ల నుంచి భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, మేయర్ బివై.రామయ్య, డిఆర్ఒ కె.మధుసూదన్ రావు, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్ తదితరులు వీక్షించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలకు ఆదోని డివిజన్‌లో 1330 మంది లబ్దిదారులకు-1375.45 ఎకరాలు, పత్తికొండ డివిజన్‌లో 932 మంది లబ్దిదారులకు-1203.99 ఎకరాలు, కర్నూలు డివిజన్ లో 320 మంది లబ్ధదారులకు - 422.74 ఎకరాల) కొత్త డిపట్టాలను పంపిణీ ఈ విధంగా జిల్లాలో ఉన్న 2582 మంది లబ్దిదారులకు 3002.18 ఎకరాలు పంపిణీ చేస్తామన్నారు. ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఆదోని డివిజన్ లో 484 మంది లబ్దిదారులకు - 702.71 ఎకరాలు, పత్తికొండడివిజన్ లో 2277 మంది లబ్ధదారులకు - 4540.57 ఎకరాలు, కర్నూలు డివిజన్ లోల 342 మంది లబ్ధదారులకు - 538.095 ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించడం ద్వారా 3103 లబ్దిదారులకు 5781.375 ఎకరాల లబ్ది జరిగిందన్నారు. అనంతరం జెసి నారపురెడ్డి మౌర్య, నగర మేయర్ బివై.రామయ్య, కోడుమూరు శాసనసభ్యులు డాక్టర్ జె.సుధాకర్ చేతుల మీదుగా కొందరు లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస కుమార్, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు, కోడుమూరు తహశీల్దార్ జయన్న పాల్గొన్నారు.

పత్రాలు పంపిణీ చేస్తున్న జెసి, మేయర్, ఎమ్మెల్యే

27, 28న మహాధర్నా

- జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కార్మికులను కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం నిర్వహించారు. అంజిబాబు మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా నవంబర్ 26, 27 ,28 తేదీలలో మహాధర్నా (మహాపడావ్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో భాగంగా విజయవాడలో 27, 28 తేదీలలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక చట్టాలలో మార్పులు తెచ్చి పని గంటలు పెంచే విధంగా లేబర్ కోడ్లను తీసుకొని వచ్చి కార్మికులను కట్టు బానిసలు చేసే నరేంద్ర మోడీ విధానానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం దేశవ్యాప్తంగా సమర శంఖాన్ని పూరిస్తుందన్నారు. లేబర్ కోడ్లుఎప్పుడైతే తీసుకుని వచ్చారో అప్పటినుండి మహా మేధావులు వారానికి 70 గంటలు పనిచేయాలని నినాదాన్ని ముందుకు తీసుకొచ్చారని విమర్శించారు. ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి ఈ మధ్యకాలంలో దేశ ఉత్పత్తి పెరగడానికి. కార్మికులు 70 గంటలు పనిచేయాలని నినాదాన్ని తీసుకొని రావడం అందులో భాగమేనని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సర్వేల ప్రకారం ఎక్కడైతే పనిగంటలు ఎక్కువగా ఉన్నాయో అక్కడ కార్మికుల మరణాలు కూడా ఎక్కువ ఉన్నాయని తెలియజేస్తున్నాయని తెలియజేశారు. ఇప్పటికే భారత దేశంలో కార్మిక వర్గం వారానికి 48 గంటలు పనిచేస్తుందని దీన్ని దొడ్డి మార్గంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు 70 గంటలుగా మార్చడానికి ప్రయత్నించాయని, వ్యతిరేకత రావడంతో ఈ మధ్యకాలంలో తమిళనాడు ,కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయని తెలిపారు.నరేంద్ర మోడీ తెచ్చిన కార్మిక చట్టాల వల్ల కార్మికులు అనేక హక్కులు కోల్పోయారని అన్నారు. నరేంద్ర మోడీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను నిలదీస్తూ పోరాటాలకి కార్మికుల సిద్ధం కావలసిన అవసరమెంతయినా ఉందని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు,సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. ఈరన్న, సిహెచ్. సాయిబాబా, ఎం .విజయ్, ప్రభాకర్ ,నాగరాజు పాల్గొన్నారు.

టెన్నిస్, క్రికెట్ అకాడమీలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు 19వ వార్డు రామ్ ప్రియ నగర్, జోహారాపురం రోడ్డులో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెన్నిస్ , క్రికెట్ అకాడమీలను నగర మేయర్ బివై రామయ్య , పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , కమిషనర్ ఎ. భార్గవ్ , ఈ టెన్నిస్ , క్రికెట్ అకాడమీ లను శుక్రవారం ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ... ప్రభుత్వ టాప్స్ (Target Olympic Podium Scheme) స్ఫూర్తితో నగర పాలక సంస్థ ఒక ప్రణాళిక ప్రకారం క్రీడాకారులను ప్రోత్సహించడానికి సౌకర్యాలు అందుబాటులోకి

క్రికెట్ ఆడి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

తెస్తోందన్నారు. నగర ప్రజలందరూ ఈ అకాడమీలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని ఇస్తాయని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. నగర కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ఈ అకాడెమీలో అత్యాధునిక సౌకర్యాలు, నిష్ణాతులైన కోచ్‌లను నియమించామని, 98481 41535 మొబైల్ నంబర్ ను సంప్రదించి అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు.

తూతూ మంత్రంగా కుల గణన సర్వే సదస్సు

-విద్యార్థులు, కుల ప్రజా సంఘాలకు ఆహ్వానం కరువు
-ప్రాంతీయ సదస్సును అధికారులు మమ అనిపించారు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కులగణన సర్వేకు చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ సర్వే నిర్వహణలో భాగంగా ప్రజాసంఘాల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. కర్నూలు జిల్లాలో నిర్వహించిన సదస్సులో మాత్రం ప్రజా సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ముగించేశారు. ఈ సదస్సును కూడా తూతూ మంత్రంగానే నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా , ఉమ్మడి అనంతపూర్ జిల్లాలకు సంబంధించిన కుల గణన సర్వే నిర్వహణపై శుక్రవారం కర్నూలు నగరంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాలులో ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వే పై కుల ప్రజా సంఘాల నుండి అభిప్రాయాలను తీసుకోవాలని భావించింది. ఈ సర్వే నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రజా సంఘాల నుంచి వచ్చిన అభిప్రాయాలను తీసుకొని వాటి ఆధారంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కర్నూలులో జరిగిన ప్రాంతీయ సదస్సులో ప్రజా సంఘాలు హాజరు నామమాత్రంగానే ఉంది. ఈ సమావేశం నిర్వహణకు సంబంధించి హడావుడిగా గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ పేరు మీద ఓ ప్రకటనలను విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. ఈ ప్రాంతీయ సదస్సుకు కేవలం ప్రజాసంఘాల నాయకులతో కాకుండా బిసి సంక్షేమ హాస్టల్స్ లోని విద్యార్థులను తరలించే అధికారులు సమావేశాన్ని ముగించేశారు. కుల గణన సర్వేను ప్రతి ఒక్కరూ ఆహ్వానిస్తున్నారు. ఆయా జిల్లాలో ఉన్నటువంటి స్థితిగతులకు అనుగుణంగా కులగణన సర్వే నిర్వహించడమే కాకుండా అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించాలని సిపిఎం డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నేరుగా లేఖ రాశారు. ఇప్పటికీ కూడా ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహణపై పూర్తిస్థాయి నిబంధనలను విడుదల చేయకుండానే హడావిడిగా సర్వే చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కులగణన సర్వేపై స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓటర్ జాబితాలో తప్పులు సరిచేయాలి

టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తప్పుల తడకగానే ఉందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. శుక్రవారం మౌర్య ఇన్‌లో ఓటర్ల జాబితా తప్పుల తడకపై ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిజి.భరత్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో చాలా తప్పులు ఉన్నాయన్నారు. బిఎల్‌ఒలు ఇంటింటికీ తిరిగి ఓటర్ జాబితా సవరణ చేపట్టినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదన్నారు. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాను తమ బూత్ ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి పరిశీలించారన్నారు. ఒకే ఇంటిపై పదికి పైగా ఓట్లు ఉన్నవి 12 వేలకు పైగానే ఓట్లు ఉన్నట్లు తేలిందన్నారు. చనిపోయిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, షిఫ్ట్ అయిన ఓట్లు వేలాదిగా ఉన్నాయన్నారు. ఇక గత ఎన్నికల్లో ఓటు వేసిన వైశ్యుల్లో 20 శాతం మంది ఓట్లు తొలగించబడ్డాయన్నారు. అదే ఇళ్లలో నివసిస్తున్న వారి ఓట్లను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వీటన్నింటినీ సరిచేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. త్వరలో విడుదలయ్యే ఫైనల్ ఓటరు జాబితా కరెక్టుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితాతో న్యాయంగా, నిజాయితీగా ఎన్నికలు జరిగే పరిస్థితి ఉండదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిస్థితి ఉండటమేంటన్నారు. దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేస్తున్న తమకు ఆందోళనగా ఉందని ఇక స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయాలంటే ముందుకు రాగలరా అన్నారు. చివరగా విడుదలయ్యే ఓటరు జాబితాలో సైతం కరెక్టుగా లేకుండా తప్పుల తడకగా ఉంటే తాము కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్ తప్పుల తడక ఓటరు జాబితాను సరిచేస్తుందని తాము ఆశిస్తున్నట్లు టిజి.భరత్ చెప్పారు.

డాక్టర్ చలపతిరావుకు ఘననివాళి



ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : లలిత కళా సమితి వ్యవస్థాపకులు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కెవి.చలపతిరావు(89)కు లలిత కళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య ఆధ్వర్యంలో శుక్రరవాం ఘనంగా నివాళ్లు అర్పించారు. హైదరాబాదులో బుధవారం రాత్రి డాక్టర్ చలపతిరావు కన్నుమూశారు. ఆయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గా ఉన్న సమయంలో సికాంపు సెంటర్లో 22 సెంట్లు స్థలాన్ని కొని లలిత కళా సమితికి రిజిస్టర్ చేయించారు. ఆ తర్వాత దానిని ఆరుబయలు కళామందిరంగా తీర్చిదిద్దారు. దాదాపు 40 సంవత్సరాలు పాటు ఆరుబయలు కళామందిరంగా ఉన్న దీని అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. సొంత నిధులు ఖర్చు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శాశ్వత సభ్యులను ఏర్పాటు చేసి వారి సహకారంతో నృత్య ప్రదర్శనలు, నాటక పోటీలు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. రాయలసీమలో ప్రముఖ కళా సంస్థగా లలిత కళా సమితిని తీర్చిదిద్దిన ఆయన మృతి పట్ల టిజివి కళాక్షేత్రంలో కళాకారులు సమావేశమై శ్రద్ధాంజలి ఘటించారు. కళా సమితి అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమానికి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంఘ ఆంజనేయులు, సివిరెడ్డి, పి.రాజరత్నం, గాండ్ల లక్ష్మన్న, పాండురంగయ్య, తదితరులు ఆయన కళా రంగానికి చేసిన సేవలను ప్రశంసించారు.

కర్నూలును కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డిగౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం మండల సభ్యుల జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి హుసేనయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో గౌస్ దేశయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఇది రైతుల ప్రభుత్వమని, ,రైతుల సంక్షేమ ప్రభుత్వమని చెప్పడం తప్ప రైతులను ఆదుకోవాలనే తపన లేదన్నారు. వర్షాలు లేక రబీ ఖరీఫ్ లో రైతులు వేసుకున్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు, సిపిఎంగా చేసిన ఉద్యమాల ఫలితంగా కరువు మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఉన్నతాధికారులందరూ 400 పైగా కరువు మండలాలు ఉన్నాయని గుర్తిస్తే, ప్రభుత్వం మాత్రం 106 మండలాలను మాత్రమే ప్రకటించడం, రైతులపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. కర్నూల్ మండలంలో 27వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారని, కెసి కెనాల్ ద్వారా తుంగభద్ర నది ద్వారా కొంతమేర నీరు అందుతుందని, వర్షం బాగా వచ్చి పంటలు బాగా పండుతాయని ఆశించిన రైతులు, వర్షాలు లేక కెసి కెనాల్ ద్వారా నీళ్లు రాక పంటలు మొత్తం నాశనం అయిపోతే, ప్రభుత్వ అధికారులు మాత్రం సాధారణ వర్షపాతం నమోదైనట్లు,రైతులు బాగున్నట్టు రిపోర్టు పంపడం రైతులను గొంతు కోయడం తప్ప మరొకటి కాదన్నారు. నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే రైతులను ఆదుకోవాలనే తపన ప్రభుత్వానికి ఉంటే కర్నూలు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతాంగాన్ని కలుపుకొని మండల కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు రాఘవేంద్ర, ఆంజనేయులు, మృత్యుంజయుడు, శ్రీరాములు, బాలపీరా, బీసన్న, నరసింహులు వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ దేశాయి

కవులు, రచయితలను సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, అధికారులు

వక్తృత్వ పోటీలు, కవి సమ్మేళనం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన ఇంచార్జ్ కార్యదర్శి వి.పెద్దక్క డిప్యూటీ లైబ్రేరియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మద్దూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఇటు వంటి అనేక కార్యక్రమాలను విద్యార్థులు చక్కగా చదువుకుంటూ వినియోగించుకోవాలని సూచించారు. ఈపోటీలు జూనియర్, సీనియర్లు విడి విడిగా విద్యార్థులకు జ్ఞానం లభించే అవకాశాలు ఉండేలా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా నాగరాజు, గంగిరెడ్డి, గోవిందరావు, మద్దయ్యలు పాల్గొని గ్రంథాలయాలవృద్ధి కోసం విద్యార్థులకు జ్ఞానం లభించే విధంగా మాట్లాడుతూ నిర్వహించారు. సాయంత్రం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా ముచ్చుకోట చంద్రశేఖర్, టి.మద్దిలేటి , గంగాధర రెడ్డి, కార్యదర్శి వి .పెద్దక్క లు మాట్లాడారు. అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ చేతులమీదుగా కవులకు శాలువాలు మెమెంటోతో సన్మానించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ లు ఎస్.బాష ,చంద్రమ్మ, రేణుక, నషీమాబీ, ఈశ్వరమ్మ, శ్రీనివాసులు తదితర ఉద్యోగులు విద్యార్థులు పాఠకులు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వంట మనిషికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-పత్తికొండ: పత్తికొండ పట్టణంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వంట మనిషికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాలయ్యారు. శుక్రవారం వంట కార్మికురాలు వీరమ్మ గ్రైండర్లో చట్నీ వేస్తూ ఉండడంతో విద్యు త్ తీగలు అస్తవ్యస్తంగా ఉండడంతో షాక్ తగిలింది. ఆమె పక్కనే ఉన్న వంట మను షులపై పడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఆమెకు విద్యుత్ షాక్ తగలడంతో ప్రాణాపాయస్థితికి వెళ్లినట్లు సమాచారం. వెంటనే పత్తికొండ ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. వంటశాలలో విద్యుత్ షాక్ తగలు తుందని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని వంట మనుషులు వాపో యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక దృష్టి సారిం చాలని విద్యార్థులు వంట నిర్వాహకులు కోరారు. కళాశాల ప్రిన్సిపల్ ఉమా కు మారిని వివరణ కోరగా వీరమ్మ ఆరోగ్యం కుదుటుగా ఉందని ఎలాంటి ఇబ్బం దులు లేదని తెలిపారు.

20 నుండి ఫిట్ ఇండియా వారోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 20 నుండి 25 వరకు ఫిట్ ఇండియా వారోత్సవాలు జరపాలని డిఇఒ వెంకట రంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20 తేదీన స్పోర్ట్స్ డే ,21న క్విజ్, వ్యాసరచన పోస్టర్ తయారీ పోటీలు, 22న స్వదేశీ ఆటలు, 23న మొబైల్ ఫిట్నెస్ అసెస్మెంట్, 24న యోగా ధ్యానం, 25న పేరెంట్స్, టీచర్స్ విద్యార్థుల సమావేశం. ఫిట్నెస్ ప్రతిజ్ఞ ఉంటాయి. ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాలు జరపాలన్నారు.

పోలకల్‌లో కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం పోలకల్ లో ఎస్ఐ మన్మథ విజయ్ సిబ్బందితో వెళ్లి అక్రమ మద్యం దుకాణంపై దాడి చేశారు. టేట్రా 90 ఎంఎల్ 40 ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. అక్కడే అక్రమ మద్యం అమ్మకందారులు బోయ చనుగొండ్ల నాయుడు, సోమప్ప నాయుడులను అదుపులోకి తీసుకొన్నారు. అక్రమార్కులు ఎంతటివారినైనా సహించేదిలేదని ఎస్ఐ హెచ్చరించారు.

48వ వార్డులో సమస్యలను తెలుసుకుంటున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ప్రజలను కోరారు. శుక్రవారం కర్నూలు నియోజకవర్గ పరిధిలోని, 48వ వార్డు 124వ సచివాలయం, రోజావీధిలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక 48వ వార్డ్ కార్పొరేటర్ మల్లికా బేగం, వైసిపి రాష్ట్ర నాయకులు సి.హెచ్ మద్దయ్య, ఖాలీద్, వక్ఫ్ బోర్డు మెంబర్ సయ్యద్ దాదా బాషా, స్టేట్ మహిళా సెక్రటరీ సఫియా ఖాతున్, రైల్వే ప్రసాద్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

నేడు పత్తికొండలో సామాజిక సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి- పత్తికొండ

పత్తికొండ పట్టణంలో నేడు జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. ఎమ్మెల్యే స్వగృహంలో పత్రికా సమావేశంలో శ్రీదేవి మాట్లాడారు. ఉదయం 9:30 గంటలకు పత్తికొండ ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి బస్సుయాత్ర మొదలై గుత్తి సర్కిల్‌కు 11:30 గంటలకు చేరుకుని మధ్యాహ్నం 01:30 గంటలకు కార్యక్రమం ముగుస్తుందన్నారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సిఎం, మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , గుమ్మనూరు జయరాం ,డాక్టర్ ఆదిమూలపు సురేష్ , విడుదల రజిని, ఉషాశ్రీ చరణ్ , రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎంఎల్‌సి రమేష్ యాదవ్ హాజరవుతారని తెలిపారు. వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు..

కెసి కెనాల్‌లో ఇద్దరు బాలురు గల్లంతు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరం బుధవారపేటకు చెందిన ఇద్దరు బాలురు కెసి కాలువలో పడి గల్లంతయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుందని కర్నూలు మూడో పట్టణ సిఐ డి.మురళీధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారపేటకు చెందిన ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో 9వ తరగతి మాల సాయిచరణ్, 8వ తరగతి పవన్ శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో కర్నూలు నగరంలోని వినాయక ఘాటు సమీపంలో ప్రవహిస్తున్న కెసి కెనాల్‌లోకి ఈతకొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు. వారికోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు.

అభివృద్ధి పనుల కోసం భూముల పరిశీలన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని అభివృద్ధి పనులకు ల్యాండ్ అలియనేషన్ కోసం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ భూములను పరిశీలించారు. శుక్రవారం మండలంలోని చిన్నపెండేకల్‌లో రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వారు చేపడుతున్న అభివృద్ధి పనులకు భూముల కేటాయింపునకు, ల్యాండ్ అలియనేషన్ కోసం సబ్ కలెక్టర్ ప్రభుత్వ భూములను పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయరాం రెడ్డి, విఆర్ఒ తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకును అభివృద్ధి పథంలో నడపాలి

- జిల్లా సహకార అధికారి రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి రామాంజనేయులు

ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకును అభివృద్ధి పథంలో నడపాలని జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు కోరారు. శుక్రవారం పట్టణంలో 70వ సహకార వారోత్సవాలు సందర్భంగా కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు కార్యాలయంలో చైర్మన్ యుకె.రాజశేఖర్ ఆధ్వర్యంలో నాలుగో రోజు టౌన్ బ్యాంకులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు సహకార సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి బ్యాంకును మంచి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని తెలిపారు. పాలకవర్గం టౌన్ బ్యాంకు చైర్మన్ యుకె.రాజశేఖర్ సహకారంతో బ్యాంకు అభివృద్ధి దిశలో ముందుకు సాగుతుందని చెప్పారు. అతి త్వరగా మొండి బకాయిలు వేలం వేస్తామని తెలిపారు. డివిజన్ సహకార అధికారి (ఆదోని) వై.ఉమాదేవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు రమాదేవి, రామరాజు, వెంకటసుబ్బయ్య, బ్యాంకు సిఇఒ గంగాధర్, డైరెక్టర్లు చాంద్ షేక్, వడ్డె రంగన్న, బుట్టా శ్రీరామ్, రజాక్, మహానందయ్య శెట్టి, బుడ్డప్ప, పల్లవి రాజశేఖర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పథకాలను వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని సూగూరు గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి పథకాల వివరాలను చదివి వినిపిస్తూ ముందుకు సాగారు. గడపగడపకు తిరుగుతున్న సమయంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఎస్ఐ వేణు గోపాల్ రాజ్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - హొళగుంద

వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

మండలంలోని ఇంగలదహల్ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దేవరగట్టు ఆలయ మాజీ ఛైర్మన్, శ్రీశైల ఆలయ మాజీ ఛైర్మన్ కీర్తిశేషులు కెసి.తిమ్మారెడ్డి జయంతి సందర్భంగా తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు ఓమ్ని హాస్పిటల్ వైద్యనిపుణుల సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కెసి.తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులు రాజేశ్వర్ రెడ్డి, కె.కార్తీక్ రెడ్డి, ఓమ్ని హాస్పిటల్ ప్రత్యేక వైద్యులు, గుండె వైద్య నిపుణులు కె.ఇందు ప్రకాష్ రెడ్డి, అఖిల్ రానా కేసరి హాజరయ్యారు. వైద్య శిబిరానికి చుట్టుపక్కల గ్రామస్తులు వచ్చారు. గుండె సంబంధిత చికిత్సలు, ఈసిజి తీసి, మందులు పంపిణీ చేశారు. వినోద్, హుస్సేన్ పీరా, అద్భుత్ కుమార్‌లు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎంపిటిసి మల్లికార్జున, హాస్టల్ వార్డెన్ శివుడు, వీరేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'20లోపు రైతులు వివరాలు సమర్పించాలి'

ప్రజాశక్తి - గోనెగండ్ల

రైతులందరూ వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్‌కు సంబంధించిన పంట సాగు వివరాలను తప్పనిసరిగా అందజేయాలని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, ఎంపిఇఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2023-ఖరీఫ్ పంట నష్టం పరిహారం కోసం రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను ఈనెల 20లోపు తప్పనిసరిగా సమర్పించాలని అన్నారు.

గడపగడపకు సంక్షేమ లబ్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్
- నగరడోనలో 'గడపగడపకు'
- నూతన సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నగరడోన గ్రామంలో సర్పంచి మల్లమ్మ అధ్యక్షతన ఆలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. మంత్రి జయరామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని మంత్రి జయరామ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సచివాలయానికి ఉచితంగా స్థలం ఇచ్చిన ఎన్‌టి.రామలింగా రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, సమస్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా ఒక పైసా అవినీతి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారని చెప్పారు. వచ్చే జనవరి నుంచి వృద్ధులకు పింఛను రూ.3 వేలు అందజేస్తున్నామన్నారు. పేదల చెంతకే 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా వైద్యులను గ్రామాల్లోకి పంపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గడపగడపకు తిరిగి ఆ ఇళ్లలోని లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించారు. సర్పంచి మల్లమ్మ, నాగేంద్ర దంపతులకు చెందిన నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి, వైసిపి సీనియర్ నాయకులు కోటిరెడ్డి, భీమ్ రెడ్డి, శేషిరెడ్డి, నాగేంద్ర, ఆలూరు జడ్‌పిటిసి శేఖర్, ఎంపిటిసి సరోజమ్మ, కాంట్రాక్టర్ ఈరన్న, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి బాలన్న, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, సూపర్‌వైజర్ ప్రసూన పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం ఇచ్చి మాట్లాడుతున్న మంత్రి జయరామ్

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని గుడ్ షెఫర్డ్ స్కూల్ పక్కన ఉన్న పాతపాల స్టోర్‌లో నూతనంగా శ్రీకృష్ణ హాస్పిటల్‌ను ప్రారంభించారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ బిఎస్.ఉష, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయాలి

- ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షులు అనిల్ కుమార్

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ టివిలు, ఆర్ఒ ప్లాంట్, గదికి నాలుగు ఫ్యాన్లు, నాలుగు లైట్లు వంటి సౌకర్యాల కల్పించిన ప్రభుత్వం పాఠశాలల నిర్వహణ కోసం గ్రాంట్స్ కూడా మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు బడుగు బసవరాజు కోరారు. శుక్రవారం ఆదోనిలోని అరబిక్ స్కూలులో సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లు సుమారు రూ.2500, మెయింటనెన్స్ ఖర్చులు ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. పాఠశాల రీ ఓపెనింగ్ సమయానికంతా విడుదల చేయాల్సిన నిధులు ఇంకా మంజూరు చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నాయకులు సురేష్ కుమార్, కోటన్న, ప్రతాప్ రెడ్డి, మద్దయ్య పాల్గొన్నారు.

పురుగుమందు వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో 'సురక్షిత పురుగుమందు వాడకం, సమగ్ర చీడపీడల యాజమాన్యం'పై శుక్రవారం శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సంస్థల భాగస్వామ్యంతో (హిల్ లిమిటెడ్ అండ్ కిసాన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అగ్రిటెక్ ప్రయివేట్ లిమిటెడ్) నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి హాజరయ్యారు. కృషి విజ్ఞాన కేంద్రంలోని వివిధ ప్రదర్శన క్షేత్రాలను సందర్శించి, రైతులకు తమ సందేశాన్ని ఇచ్చారు. వివిధ ప్రయివేట్ కంపెనీల వారు (కోరమాండల్, బేయర్స్, సింజేంటా, హిల్, కోటెవా, అదామా, ఎన్‌ఎస్‌సి) తమ ఉత్పత్తులను రైతుల సందర్శనార్థం ప్రదర్శించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాతమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రమేష్ నాయక్ పురుగు మందుల పిచికారి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, చీడపీడల బారీ నుంచి పంటను కాపాడుకోవడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మెళకువల గురించి తెలిపారు. డాక్టర్ కెఎస్ఎస్ నాయక్, డాక్టర్ పి.అపర్ణ, డాక్టర్ వై.మౌనిక, డాక్టర్ చందన, డాక్టర్ నిరంజన్ రెడ్డి, ఎం.మహాదేవయ్య పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

సమన్వయంతో పని చేయాలి : ఎంపిపి

- మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని ఎంపిపి నెట్టికంటమ్మ కోరారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఒ ఆంతోని ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ చేస్తామని ఎంపిడిఒ ఆంతోని హెచ్చరించారు. ఎఒ శివశంకర్ మాట్లాడుతూ... పిఎం కిసాన్ రూ.2 వేలు రైతుల ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. రైతు భరోసా కొద్ది రోజుల్లో పడతాయన్నారు. జడ్‌పిటిసి లింగప్ప, వైస్ ఎంపిపి నాగేష్, వెటర్నరీ డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- టిడిపి, జనసేన ఇన్‌ఛార్జీలు మీనాక్షి నాయుడు, మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

టిడిపి, జనసేనల ప్రభుత్వం వస్తే అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఆ పార్టీల నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు మీనాక్షి నాయుడు, మల్లప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆరేకల్ గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా గ్రామంలో కరపత్రాలను, బాండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. బాబు అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో కరువు తాండవిస్తోందని తెలిపారు. ఇక్కడ ఉండలేక సుదూర ప్రాంతాలైన గుంటూరు, విజయవాడ, తెలంగాణకు వలస పోతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రామస్వామి, రంగన్న, ఆరేకల్ రామకృష్ణ, దొడ్డనకేరి శివప్ప, జనసేన నాయకులు రమేష్ యాదవ్, వేణు వర్మ, పులి రాజు, శంకర్ రెడ్డి, భీమా, నాగరాజు, నీలకంఠ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి శూన్యం : గుడిసె ఆది కృష్ణమ్మ

ఆదోని : వైసిపి హయాంలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల వద్దకు వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2024లో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాశక్తి తదితర పథకాలతో మహిళలకు మేలు జరుగుతుందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో కనీస అవసరాలు తీర్చలేదని విమర్శించారు. ఎక్కడ చూసినా రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, తాగునీటి సమస్య వేధిస్తోందని తెలిపారు. డ్రెయినేజీలు కూడా సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అర్హత ఉన్నా చాలామందికి పింఛను రావడం లేదని విమర్శించారు. నాయకులు మురళీ, తెలుగు యువత ఉపాధ్యక్షులు గుడిసె రామకృష్ణ, సాధిక్ వలీ, సంతేకుడ్లూరు రాఘవరెడ్డి, బాబురావు, లక్ష్మీకాంత రెడ్డి, చిరంజీవి, సురేష్, బాలరాజు, శాంత రాజు, వీరేష్, మహాలింగ, సిద్ధ ఉన్నారు. **పెద్దకడబూరు** మండలం మురవణి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సత్యన్న గౌడ్, లారీల రంగన్న, చంటోడు, ఎంపిటిసి జాన్, సురేష్, యోహాన్, చెన్నకేశవులు, దస్తగిరి, నరసయ్య, తెలుగు యువత చెన్నకేశవ, వీరేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో మేనిఫెస్టోను వివరిస్తున్న మీనాక్షి నాయుడు, మల్లప్ప

సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

పెద్దకడబూరులో వివరిస్తున్న దివాకర్‌రెడ్డి

'జిల్లా కోర్టులో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఉన్న జిల్లా అదనపు కోర్టులో పూర్తిస్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టి సేవలు సకాలంలో అందేలా చూడాలని ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు అనిత బాయి కోరారు. శుక్రవారం కర్నూలు నగరంలో జిల్లా జడ్జి శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా కోర్టులో ఉద్యోగుల నియామకం పూర్తిస్థాయిలో లేకపోవడంతో కేసులకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. భవనాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపాలని కోరారు. వారానికి రెండుసార్లు సబ్ జడ్జి ఆదోనిలో పని చేసేలా ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. జిల్లా జడ్జి శ్రీనివాస రావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. న్యాయవాదులు ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు సవితా రాణి, లావణ్య ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని హెచ్.మురవాణి రెవెన్యూ పరిధిలోని హనువాపురం, రాగిమాన్‌దొడ్డి, గంగులపాడు, దొడ్డిమేకల, హెచ్.మురవణి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌తో కలిసి మంత్రాలయం నియోజకవర్గం ఆర్ఒ రమా శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తక్షణమే వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విఆర్ఒ విక్రం రెడ్డి, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

నమ్మకానికి వమ్ము చేయను

- చిరుతపల్లి ఈరన్న

ప్రజాశక్తి - కౌతాళం

తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిజెపి అభివృద్ధి కోసం పని చేస్తానని బిజెపి నియోజకవర్గ కోకన్వీనర్‌గా ఎన్నికైన చిరుతపల్లి ఈరన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి, కర్నూలు జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, ఓబీసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, రాష్ట్ర నాయకులు ఖగోల్ హరీష్ తనకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

'డిపాజిట్ చెల్లించి ఏడాది గడిచింది'

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం డిపాజిట్ చెల్లించి ఏడాది గడిచిందని, పనులు ప్రారంభించాలని లబ్ధిదారులు దాసరి శంకర్ రావు, ఇసాక్ పటేల్, ఎరుకల రమేష్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు వారు మాట్లాడారు. పట్టణంలోని పాతబస్టాండ్ మైదానంలో షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల నిర్మాణం కోసం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు గతేడాది నవంబర్‌లో వేలం నిర్వహించారని తెలిపారు. దుకాణాల కోసం రూ.10 లక్షల నుంచి రూ.63 లక్షల వరకు టెండర్లలో పాల్గొని దక్కించుకున్నామన్నారు. దుకాణాల కోసం 1/4 శాతం డిపాజిట్ చెల్లించామని తెలిపారు. పనులు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. ఈనెల 23న భూమి పూజ చేయిస్తామని, ఆలోపు లబ్ధిదారులకు అగ్రిమెంట్ ఇస్తామని కమిషనర్ రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. లబ్ధిదారులు మల్లికార్జున, మహబూబ్ బాష, ఏక్బాల్ ఉన్నారు.

సేవా దృక్పథంతో ముందుకెళ్తాం

- వైసిపి జిల్లా కోశాధికారి మధుసూదన్ రెడ్డి
- రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి- దేవనకొండ

మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తామని వైసిపి జిల్లా కోశాధికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశాఖ పీఠాధిపతి స్వరూప నందేంద్ర స్వామి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో అనాథ, నిరుపేదల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. తెర్నేకల్ ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, వార్డు సభ్యులు బడే సాబ్, గ్రామస్తులు మోహన్, హనుమంతు, పురుషోత్తమ రెడ్డి, రాజశేఖర్, గోపి పాల్గొన్నారు. ఆస్పరిలోని కస్తూరిబా పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి పల్లవి యోగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతుండగా విద్యార్థికి మధుసూదన్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పత్తికొండ పట్టణంలోని వృద్ధాశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ ఎంపిపి నాగరత్నమ్మ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ నైతిక విలువలు కలిగి విద్యనభ్యసించినప్పుడే విద్య అనే పునాదిపై ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలరని తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిల్లలను కష్టపడి గొప్ప విద్యావంతులు చేయాలని తల్లిదండ్రుల కోరిక అని తెలిపారు. వారి కోరికను, కలలను సహకారం చేయాలని సూచించారు. చదువుతున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ప్రస్తుతం విజ్ఞాన రంగం అభివృద్ధి చెందుతున్న సమయంలో కొంతమంది విద్యార్థులు సెల్ ఫోన్లకు, చెడు అలవాట్లకు గురై సమయాన్ని వృథా చేస్తున్నారని చెప్పారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బాలికలు కష్టపడి చదివి ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేసుకోరాదని సూచించారు. జాతీయ విద్యార్థి దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పర్యవేక్షకులు జయలక్ష్మి, భీమేష్, రాజు పాల్గొన్నారు.

'ప్రకృతి అందాలపై అవగాహన అవసరం'

ప్రజాశక్తి - ఆస్పరి

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులు ప్రకృతి అందాలపై అవగాహన పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సంగీతం, నాట్యం, క్రీడలపై ప్రావీణ్యం పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 20న బహుమతులను ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు జైపాల్, విజేత హైస్కూల్, నోబుల్, నారాయణ ప్రైమ్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- హ్యూమన్ రైట్స్ కమిటీ రైట్ టు ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ డివిజన్ అధ్యక్షులు అజిత్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని హ్యూమన్ రైట్స్ కమిటీ రైట్ టు ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ డివిజన్ అధ్యక్షులు అజిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉర్దూ హైస్కూల్లో హ్యూమన్ రైట్స్ కమిటీ రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009 విద్యా హక్కు చట్టం అమలుకు సంబంధించి, బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూజ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి పట్టణ ఎస్ఐ మస్తాన్ వలీ, ట్రస్ట్ డివిజన్ అధ్యక్షులు అజిత్ కుమార్ మాట్లాడారు. ఉచిత విద్య నిర్బంధ హక్కు చట్టం (ఆర్‌టిఇ) అనేది ఆగస్టు 4, 2009న పార్లమెంట్ చట్టం ద్వారా రూపొందించినట్లు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎలో ఉందని, 6 నుంచి 14 ఏళ్ల విద్యార్థులందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయాలని చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలను వేధింపులకు గురి చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉర్దూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటప్ప మాట్లాడుతూ... విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో భాగంగా బడిబయట ఉన్న విద్యార్థులను బడిలోకి తీసుకొచ్చి వంద శాతం ఎన్‌రోల్‌మెంట్ సాధించి విద్యా ప్రగతికి కృషి చేస్తామని తెలిపారు. ఇంగ్లీష్ టీచర్ ఇషాద్ అహ్మద్ మాట్లాడుతూ... విద్యార్థులందరూ విద్యలో రాణించి దేశ ప్రగతిలో వెన్నెముకగా నిలబడాలని తెలిపారు. హెచ్‌ఆర్‌సి సభ్యులు ప్రతాప్, శ్రీకాంత్, హనుమంతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ మస్తాన్ వలీ

ధర్మరక్షణే ధ్యేయంగా టిటిడి చర్యలు

- టిటిడి పాలకమండలి మండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా టిటిడి చర్యలు ఉంటాయని టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పాత ఊరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోమాతతో నగర సంకీర్తన శోభాయాత్ర, గోపూజతో పాటు కుంకుమార్చన గోమాతకు పూజలు చేశారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ధర్మప్రచార మండలి సభ్యులు పి.సూర్యనారాయణ, ఎన్.భీమిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పి.భీమాచార్యులు, అర్చకులు శ్రీరంగం శేషాచార్యులు, మధుసూధనా చార్యులు, భాస్కరా చార్యులు, వెంకటేష్, ప్రవీణ్, రంగయ్య, విశ్రాంత తహశీల్దార్ బాబురావు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, మండల ఉపాధ్యక్షులు పులికుక్క రాఘవేంద్ర, గోర్కల్ కృష్ణ, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, కురువ మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి, శ్రీశైలం ధర్మకర్తల మండలి సభ్యులు సుజాత శంకర్, విజయమోహనా చార్యులు, శివ కుమార్, ఈరయ్య శెట్టి, తిమ్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు, మొలగవల్లి గ్రామంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆలూరు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. శుక్రవారం జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మోడల్ స్కూల్, బాయ్స్-1, 2, గురుకుల పాఠశాల 6, 7, 8వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మొలగవల్లి గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్ ఆధ్వర్యంలో సమ్మేళనాలు, రచయితల సందేశాలు, వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి, ఉపాధ్యాయులు అన్నే శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఇష్టాగోష్ఠిలో కవి అన్నే శ్రీనివాస రెడ్డి, కళాకారులు మోక మల్లయ్య, హార్మోనిస్టు గోపాల్, దండు మాణిక్య రెడ్డి పాల్గొన్నారు. శ్రీనివాస రెడ్డి తమ పద్య కవితలతో పాఠకులను అలరించారు. భవాని పాత్ర ధారి దండు మాణిక్య రెడ్డి తన అభినయాన్ని ప్రదర్శించారు. అనంతరం కవులను, కళాకారులను సన్మానించారు. ఉపాధ్యాయులు ప్రకాష్, శివ, ఆదిలక్ష్మి, ఛత్రప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE SPECIAL MOBILE COURT - CUM - 3RD ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KURNOOL
E.P.NO.286/22 IN O.S.NO. 754/20

ఆర్.శేశిరెడ్డి. ...డి,హెచ్,ఆర్

వర్సెస్

వి.నాగేంద్ర. ...జె.డి.ఆర్

నోటీసు టు జె.డి.ఆర్

ఇందుమూలముగా రెస్పాండెంట్/జె.డి.ఆర్ కి తెలియజేయడం ఏమనగా కోర్టు ద్వారా ఇ.పి నోటీస్‌లను రెస్పాండెంట్ పంపిన అవి ముట్టనందున ఈ పత్రిక ద్వారా ఇ.పి. నోటీస్‌ను పంపుచున్నాము. కావున రెస్పాండెంట్/ జె.డి.ఆర్ వారు డి.హెచ్.ఆర్ వారు వేసిన డిక్రీ అమలు వ్యాజ్యంలో 20-11-2023న ఉదయం 10:30 గంటలకు హాజరై రెస్పాండెంట్/జె.డి.ఆర్ తమ ఆక్షేపణలు చెప్పుకొనవచ్చునని, లేనియెడల పరోక్షముగా విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేది : 20-11-2023

S.Ch. MABU SAHEB,
D.H.R Advocate,
Kurnool.

ప్రజాశక్తి

శనివారం 18 నవంబర్ 2023 5

నంద్యాల

లబ్ధిదారులకుభూ హక్కు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ తదితరులు

డోన్ టిడిపి అభ్యర్థి మార్పు?

- కోట్ల కుటుంబానికి ఇచ్చే అవకాశం
- జోరుగా సాగుతున్న చర్చ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

డోన్‌లో టిడిపి అభ్యర్థిని మార్చాలని ఆ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. కోట్ల కుటుంబ సభ్యులకు టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది...

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. డోన్ నియోజకవర్గంలో టిడిపిలో అభ్యర్థిని మార్చాలని ఆ పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మొదటగా డోన్‌లోనే ఆ పార్టీ టిడిపి అభ్యర్థిని ప్రకటించింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్యాపిలి మండలం జలదుర్గంలో నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా డోన్ టిడిపి అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించారు. ఆయనను గెలిపించాలని కూడా ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పటి నుంచి ధర్మవరం సుబ్బారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అయితే ఆ నియోజకవర్గంలో కాస్త బలం ఉన్న కెఇ వర్గీయులు ధర్మవరం సుబ్బారెడ్డిని వ్యతిరేకిస్తున్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్యాపిలి మండలంలో యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టిన సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా కరపత్రాలు వేశారు. అయినా అవేమీ పట్టించుకోకుండా ధర్మవరం సుబ్బారెడ్డి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకెళ్లారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో టిడిపి అదిష్టానం ఆ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. బుగ్గనకు పోటీ ఇవ్వగలిగే అభ్యర్థినే ఆ స్థానంలో నిలబెట్టాలని నిర్ణయించింది. తొలుత బుగ్గనకు ధర్మవరం సుబ్బారెడ్డి సరైన పోటీ ఇవ్వగలుగుతారనే అనుకున్నా ప్రస్తుతం పునరాలోచిస్తున్నట్లు సమాచారం. కోట్ల కుటుంబ సభ్యుల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కోట్ల సుజాతమ్మ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆమె గతంలో డోన్ నుంచి పోటీ చేసి గెలవడంతో ఆమెకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కోట్ల సుజాతమ్మ అయితే పార్టీలో వర్గాలు లేకుండా ఉంటాయని అదిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. డోన్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఈ అంశం జోరుగా చర్చ సాగుతోంది. అయితే ధర్మవరం సుబ్బారెడ్డి ఇప్పటికే రూ.పది కోట్ల వరకూ పార్టీ కోసం ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. అదే అంశాన్ని ఆయన అదిష్టానం పెద్దల ముందు చెప్పినట్లు సమాచారం. ఆ విషయం కూడా పరిగణలోకి తీసుకుంటామని సుబ్బారెడ్డికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదిష్టానం చివరకు ఎవరి పేరును ఖరారు చేస్తుందో అధికారికంగా ప్రకటించేవరకూ వేచి చూడాల్సిందే.

మహాధర్నాను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్ర, బిజెపి ప్రభుత్వ కర్షక, కార్మిక సామాన్య ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28న విజయవాడలో జరిగే మహ ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నంలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మహ ధర్నాను జయప్రదం చేయాలని ఆటో జాతను వారు ప్రారంభించారు. మండలంలోని కరివేన, కొత్త రామాపురం, నల్ల కాలువ, సిద్ధపల్లె, ముష్టపల్లె, వెంకటాపురం, ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట, కురుకుంద, వడ్ల రామాపురం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పంటలన్నిటికీ సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి ఎంఎస్‌పిలను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించరాదని, కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక హక్కులను పునరు ద్ధరించాలన్నారు. అసంఘటితరంగా కార్మికులను రిజిస్ట్రేషన్ చేసి వారికి పెన్షన్‌తో సహ సామాజిక భద్రతా అందించాలన్నారు. ఉపాధి హామీ పని రోజు వేతనం రూ. 600కు పెంపు, ఉపాది పని దినాలు 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం అమలు చేయాలన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించి ఆహారం మందులు వ్యవసాయ ఉపకరణాలు నిత్యవసరాలపై జిఎస్టిని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయ, కౌలు, సిఐటియు సంఘాల నాయకులు నరసింహ నాయక్, సుధాకర్, మా భాష, స్వాములు, రామ్ నాయక్, సురేంద్ర, మహమ్మద్, మారెన్న, పాలశివుడు, దాసు, కిరణ్, సంజీవ రాయుడు, మల్లయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల కార్మికుల ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న బిజెపి వైసిపి విధానాలకు నిరసనగా నవంబర్ 27, 28 తేదీలలో విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి యేసురత్నం ఏ నాగరాజు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం బిజెపి విధానాలను అనుసరిస్తూ అంగన్వాడి ఆశ మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసి మర్చిపోయిందన్నారు. మహాధర్నానలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. **కొత్తపల్లి :** విజయవాడలో జరిగే మహ ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, దాసు తదితరులు ఆటో జాతను కొత్తపల్లి మండలంలోని గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతు, వ్యవసాయ, కౌలు, సిఐటియు సంఘాల నాయకులు నరసింహ నాయక్, సుధాకర్, మా భాష, రామ్ నాయక్, మహమ్మద్, సత్యనారాయణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** విజయవాడలో జరుగు మహ ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి కోరారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని భరత్ కాంప్లెక్స్ లో రైతు, వ్యాకాస, సిఐటియు నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి పీ పకీర్ సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించుకోవాలని, మీటర్లను తొలగించరాదని, వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించరాదన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, రోజువారిఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధి హామీ పథకంలో 200 రోజులకు పెంచి, పట్టణ ప్రాంతంలోనూ ఉపాధి హామీ అమలు చేయాలన్నారు. తదితర సమస్యల పరిష్కారం కోసం కార్మికులు, కర్షకులు, రైతులు మహ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన బుక్‌లైట్స్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్ బాలయ్య,ఈశ్వరమ్మ, ఎం కర్ణ, సంపంగి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు సి నాగన్న, జి నాగమణి నరసింహులు, రైతు సంఘం నాయకులు ఏసన్న, ఏసేపు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు : బుక్‌లెట్స్ విడుదల చేస్తున్న నాయకులు

అర్హులందరికీ భూ పంపిణీ

- జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భూమిలేని పేదలకు భూమిని అందిస్తూ... భూములపై సర్వహక్కులు కల్పిస్తూ జిల్లాలో అర్హులైన లబ్ధదారులకు భూ యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో బహిరంగ సభ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,24,709 మందికి లబ్ధి చేకూరుస్తూ 35,44,866 ఎకరాల భూములకు సర్వ హక్కులు కల్పిస్తూ భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ చేసే లాంఛన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి, ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా, బనగానపల్లె శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ మాట్లాడుతూ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ అర్హులైన నిరుపేదలందరికీ భూ పట్టాల పంపిణీ చేస్తున్నామన్నారు. ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి డోన్ డివిజన్ లో 2296 మంది లబ్ధిదారులకు 3843.96 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 3455 మంది లబ్ధదారులకు 6017.36 ఎకరాలు, నంద్యాల డివిజన్ లో 703 మంది లబ్ధదారులకు 1098.37 ఎకరాల భూములకు సర్వ హక్కులు కల్పించామన్నారు. భూమి లేని నిరుపేదలకు నంద్యాల డివిజన్‌లో 531 మంది లబ్ధిదారులకు 705.43 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 129 మంది లబ్ధిదారులకు 154.30 ఎకరాలు, డోన్ డివిజన్‌లో 1716 మంది లబ్ధదారులకు 2561.14 ఎకరాల కొత్త డి పట్టాలను జిల్లాలో ఉన్న 2376 మంది లబ్ధిదారులకు 3420.87 ఎకరాలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ సర్వీస్ ఇనామ్ భూములకు సంబంధించి డోన్ డివిజన్ లో 5319 మంది లబ్ధిదారులకు 9223.956 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 6527 మంది లబ్ధిదారులకు 11157.69 ఎకరాలు, నంద్యాల డివిజన్ లో 10800 మంది లబ్ధిదారులకు 19646.6 ఎకరాలు సర్వీస్ ఇనామ్ తొలగించడం ద్వారా 22646 మంది లబ్ధిదారులకు 40,028.246 ఎకరాలు లబ్ధి జరిగిందన్నారు. ఎస్సీ కమ్యూనిటీ వారికి స్మశాన వాటికలకు సంబంధించి 10 ఎకరాల 10 సెంట్లు భూమిని కేటాయించామన్నారు. అలాగే జగనన్న శాశ్వత భూ హక్కు భూ పథకం కింద రెండవ దశ రీసర్వేలో చేపట్టిన 73 గ్రామాల్లో 38,754 మంది రైతులకు 1లక్షా 53 వేల ఎకరాల 988 సెంట్ల భూములకు సంబంధించిన భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఉన్న భూ సమస్యలకు ప్రభుత్వం చరమగీతం పాడుతూ భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు, ఇప్పటికే అసైన్డ్ గ్రామ సర్వీస్ ఇనామ్, ఎస్సీ కార్పొరేషన్ (ఎల్‌పిఎస్) భూములు పొందిన వారికి వాటిపై సర్వ హక్కులు కల్పించే భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీకి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు.ఇదొక చారిత్రాత్మక మార్పులకు నాంది అవుతుందన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారు లకు అతిథుల చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు.

డోన్ నుండి శ్రీశైలానికి బస్సు

ప్రజాశక్తి-డోన్

డోన్ నుండి శ్రీశైలం కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశి భూషణ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డోన్ ఆర్టీసీ డిపో నుండి కార్తీకమాసం సందర్భంగా శ్రీశైలంకు డోన్ నుండి ప్రతి సోమవారము ఉదయము 6 గంటలకు ఎక్స్ ప్రెస్ బస్సు వెళ్తుందని,ఈ బస్సు తిరిగి శ్రీశైలంలో సాయంత్రము మూడు గంటలకు బయలుదేరి డోన్ కు చేరుతుందని తెలిపారు. పెద్దలకు 380 రూపాయలు పిల్లలకు 200 రూపాయలు ఛార్జీ వసూలు చేయబడుతుందని ఒకే బ్యాచ్ గా 40 మంది ప్రయాణికులు ఉన్నా కూడా స్పెషల్ బస్సు శ్రీశైలంకు నడపబడుతుందని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు.

భూగర్భ, గనుల శాఖ అధికారి ఇంట్లో అనిశా సోదాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అసిస్టెంట్ జియాలజిస్ట్ గండి కోట వేంకటేశ్వర్లు నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు రావడంతో వెంకటేశ్వర్లు ఇంటిలో సోదాలు చేశారు. వెంకటేశ్వర్లు నంద్యాల భూగర్భ, గనుల శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పైన ఆదాయనికి మించి అక్రమంగా ఆస్తులు సంపాందించారని గుంటూరుకు చెందిన ఏసీబీ అధికారులు తెలిపారు. వెంకటేశ్వర్లు ఉంటున్న గుంటూరులోని ఏఎన్‌యూ వద్ద ఐజేయం విల్లాస్‌లో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇతనికెల్లో దాదాపు మూడు కోట్లు పైన ఆస్తు లు ఉన్నట్లు గుర్తించామని, అందులో రెండు కోట్లు అక్రమ ఆస్తులు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. డాక్యుమెంట్లను, నగలను నగదును సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు.

మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి

టిడిపి, జనసేన ప్రభంజనాన్ని ఆపలేరు

- జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రముఖ సీనియర్ న్యాయవాది పత్తి సుబ్బరామిరెడ్డి స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1982లో టిడిపి సృష్టించిన ప్రభంజనం రేపు జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన పొత్తుతో మరోమారు పునరావృతం కావడం ఖాయమని పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాలలో తమ పర్యటనలో ఎక్కడ చూసినా జనసేన పార్టీకి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుని పోయిందని దాని నుండి విముక్తి కలిగించేందుకు తెలుగుదేశంతో కలిసి పయనించాలని పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. వైకాపా రాక్షస పాలనలో ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి మంచి మనసుతో పార్టీలో చేరిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. టిడిపి నాయకులు మద్దూరు భార్గవ్ రామ్, ప్రముఖ న్యాయవాది పత్తి సుబ్బరామిరెడ్డి, జనసేన నాయకులు లక్ష్మీనారాయణ, రమణ, అంజి, రామ్మోహన్, కృష్ణ మూర్తి, జనసేన లీగల్ అడ్వైజర్ గంగుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20 వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి అండర్ 17, 19 బాల బాలికల విభాగంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.నరేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 9 నుంచి 11 వరకు బాపట్ల జిల్లా లో జరిగే 42వ అండర్ 19 రాష్ట్రస్థాయి పోటీలకు నంద్యాల జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 8639298051,9160730288 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే కేంద్రం మహిళా బిల్లు

- ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతోనే సామాజిక న్యాయం
- రాష్ట్రంలో కరువును తగ్గించి చూపిస్తున్న సిఎం జగన్ రెడ్డి
- నంద్యాలలో ఎపి మహిళా సమాఖ్య15వ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

బహిరంగసభలో మాట్లాడుతున్న ముప్పాల నాగేశ్వరరావు

రాజకీయ లబ్ధి కోసమే నరేంద్ర మోడీ పార్లమెంటులో మహిళా బిల్లు తీసుకొచ్చారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ నాయకురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. కేంద్రం తీసుకొస్తున్న చట్టాలను కేంద్రీకృతం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారని, దీంతో సామాజికన్యాయం, మహిళా సాధికారత ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభల సందర్భంగా శుక్రవారం నంద్యాల పెద్ద మార్కెట్ యార్డ్ నుండి మున్సిపల్ టౌన్ హాల్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ నాయకురాలు వనిజ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పుకునే నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. మహిళలకు కనీస గౌరవం కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. రోజురోజుకు మహిళలపై ఆకృత్యాలు అత్యాచారాలు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మణుపూర్‌లో మహిళలను నగ్నంగా తిప్పినా మోడీ ప్రభుత్వానికి స్పందన లేదన్నారు. మహిళా సాధికారతను తుంగలో తొక్కారని, మహిళా రిజర్వేషన్ బిల్లు కేవలం ఒక నాటకమని అన్నారు. ప్రధాని మోడీకి మహిళల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా చట్టసభలలో మహిళా రిజర్వేషన్లను రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికలకే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో మహిళలు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. కేంద్రం తీసుకొస్తున్న చట్టాలను కేంద్రీకతం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారని, దీంతో సామాజికన్యాయం, మహిళా సాధికారత ఎలా సాధ్యమని ప్రశ్నించారు. లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు రంగ సంస్థకు అప్పగిస్తూ ఉపాధిని దెబ్బతీస్తున్నారని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కారదర్శి ముప్పాల నాగేశ్వరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మహిళా ఓట్లు కొల్లగొట్టడానికి తన రాజకీయ లబ్ధికోసం పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టారన్నారు. ఆ బిల్లును 2024 నుండి అమలు చేయకుండా 2030 నుండి అమలులోకి తెస్తామని చెప్పడంలోనే మోడీ చిత్తశుద్ధి బయటపడిందని విమర్శించారు. మహిళలను మళ్లీ వెనక్కి పంపడానికి నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కరువు విలతాండవమాడుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కరువును తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి గుంటూరు పల్నాడు వంటి ప్రాంతాలకు ప్రజలు వలసలు పోతున్నారని, వారిని ఆదుకోవడంలో జగన్మోహన్ రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. బహిరంగ సభ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాక్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అధ్యక్షత వహించారు . బహిరంగ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గ భవాని వర్కింగ్ అధ్యక్షులు అత్తిలి విమల, రాష్ట్ర కార్యదర్శులు పాల్గొన్నారు.

రిలే దీక్షలను జయప్రదం చేయండి

- అంగన్వాడి వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఆత్మకూరులో వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నందికొట్కూరులో వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ, పెన్షన్, ఇతర సమస్యలు పరిష్కారం కోసం శనివారం నాడు నందికొట్కూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు జరుగు రిలే దీక్షలను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, ప్రాజెక్టు అధ్యక్షురాలు డి, మదర్ బి కోరారు. శుక్రవారం అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సూపర్వైజర్లు రవణమ్మ, వెంకటేశ్వరమ్మకి పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, ప్రాజెక్టు అధ్యక్షరాలు డి మదర్ బి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. మార్చి 23వ తేదీన శాసనమండలిలో ఐసిడిఎస్ మంత్రి అంగన్వాడి వర్కర్స్ యూనియన్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదన్నారు. అక్టోబర్ 9వ తేదీన అధికారులతో జరిగిన చర్చల్లో కూడా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాలేదని, ఎలక్షన్ కంటే ముందు ఇచ్చిన హామీని అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీని రాష్ట్రంలో అమలు చేయాలి, తదితర సమస్యల పరిష్కారం కోసం రిలే దీక్షలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, సాయి లీల, హుస్సేన్ బి, తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంగన్వాడీల సమస్యల పరిష్కారం కొరకు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు దగ్గర ఈనెల 18న జరిగే రిలే నిరాహార దీక్షలను అంగన్వాడీ టీచర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, లక్ష్మీదేవిలు కోరారు. ఈ మేరకు ఐసిడిఎస్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని, వేతనాల పెంపు,గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కొరకు అనేక రకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని, అనేకమార్లు విజ్ఞప్తి చేశామని,మార్చి 23వ తేదీ శాసనమండలిలో ఐసిడిఎస్ మంత్రి అంగన్వాడి యూనియన్ లతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదని,అక్టోబర్ 9వ తేదీన అధికారులతో జరిగిన చర్చలలోనూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్కెల పరిష్కారం కోసం 2023 డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె చేయాలని సిఐటియు తదితర అనుబంధ అంగన్వాడి యూనియన్ల రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయి అన్నారు.కావున డిసెంబర్ 8 నుండి జరిగే నిరవధిక సమ్మె నేపథ్యంలో ఈ లోగా వివిధ రూపాలలో ఆందోళనా కార్యక్రమాలు కొనసాగించాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో రవణమ్మ, ప్రియాంక, చెనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

టిడిపి, జనసేన కలిసి పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ప్రజాశక్తి - ఆత్మకూర్

తెలుగుదేశం పార్టీ అనుభవం, జనసేన పార్టీ కార్యకర్తలు యువతరం కలిసి పని చేస్తే నియోజవర్గంలో ఉమ్మడి పార్టీ నాయకత్వం తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీలో సమన్వయ కమిటీ సమావేశం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి జనసేన కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజల అభిమానాన్ని సంపాదించాలన్నారు. వైయస్సార్ పార్టీకి చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి చేరడం జరుగుతున్నదని ఏ మండలంలో ఏ కార్యకర్త ఏ నాయకుడు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు ముందుగానే ప్రకటిస్తామని చేతనైతే వైసిపి కార్యకర్తలను టిడిపిలోకి రాకుండా అడ్డుకోవాలని శిల్పా చక్రపాణి రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. సమావేశంలో టిడిపి నాయకులు శివప్రసాద్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది గోవిందరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా, జనసేన నాయకులు అశోక్, శ్రీరాములు, తదితరులు మాట్లాడారు. నియోజవర్గం నుండి ఇరు పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు.

లక్ష్మీనరసింహస్వామి అర్చకుడు మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోనే కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆలయ పూజారిగా పనిచేస్తున్న రాఘవయ్య(83)అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. రాఘవయ్య పిఈటి ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయి రాఘవయ్య నరసింహస్వామి దేవస్థానం నందు అనేక సంవత్సరాలుగా పూజారిగా పనిచేశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ కర్నూల్లో చికిత్స పొందుతూ అక్కడి వైద్యులు సూచన మేరకు హైదరాబాదుకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలి

- పలు రాయితీలతో ప్రభుత్వం ప్రొత్సాహం
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు
- నేడు ఆయిల్ ఫాం సాగుపైన అవగాహన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా ప్రాంతం ఆయిల్ ఫాం పంట సాగుకు అనుకూలమని అందుకు పంటసాగు చేసుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశకితో మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే ప్రయత్నలలో రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫాం పంటలను ప్రోత్సాహి స్తోందని పేర్కొన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలమైన ప్రాంతం కాదా అని హార్టికల్చర్ విశ్వవిద్యాలయం రిసోర్స్ పర్సన్స్ ఉద్యాన శాఖ అధికారులు ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న భౌగోళిక వాతావరణ పరిస్థితులను పరిశీలించడంతోపాటు అధ్యయనం చేశారన్నారు. ఆయిల్ ఫాం సాంగుకు అనుకూలమని ప్రభుత్వం నిర్ధారించి ఈ పంట సాగుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఈ పంట సాగు చేపట్టడానికి ఎఫ్ఎఫ్ఎఫ్ కంపెనీ, కృషి సోయి కంపెనీ, నవభారత్, తిరుమల ప్రొడక్షన్ వంటి నాలుగు కంపెనీలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఐ వాంట్ కంపెనీలకు ఏర్పాటు చేసుకొని దీనితోపాటు ఈ కంపెనీలకు కొన్ని మండలాలను కేటాయించడం జరిగిందన్నారు. కంపెనీల కేటాయించిన మండలాల్లో ఈ కంపెనీలే నేరుగా ఆయిల్ ఫామ్స్‌కు అవసరమైన మొక్కలు, గెలలు కొనుగోలు చేయడం మార్కెటింగ్ సదుపాయం వంటి సౌకర్యాలను కంపెనీల ద్వారా కల్పిస్తారని తెలిపారు. కాబట్టి రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకునేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. ప్రభుత్వము ఈ పంట సాగుకు తోడ్పాటు అందిస్తుందని రైతన్నల సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ పంటపై అవగాహన కల్పించేందుకు నంద్యాల జిల్లాలో శనివారం కలెక్టరేట్ లోని ఆర్ఏఆర్ఎస్ సెంటినరీ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

వందే భారత్‌ను డోన్‌లో ఆపాలి : చైర్మన్

అరుణ్ కుమార్ జైన్ కి వినతి పత్రం అందిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

ప్రజల సౌకర్యార్థం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును డోన్ నందు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను కోరారు. శుక్రవారం డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్ నందు డోన్‌కు వచ్చినటువంటి సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కి కాచిగూడ నుంచి బెంగళూరుకి వెళ్తున్నటువంటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును డోన్ నందు స్టాపింగ్ ఇచ్చి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కోసం ఈ ప్రాంత ప్రజలు నంద్యాల నుంచి వచ్చేవాళ్లు బెంగళూరుకి పోవాలన్నప్పుడు ఇక్కడికి వచ్చి రైలు ఎక్కాల్సిందే అని కొత్త జిల్లా ఏర్పాటు చేశారు కాబట్టి నంద్యాల జిల్లా హెడ్ క్వార్టర్స్ కింద అవకాశం ఇచ్చి ఇక్కడ రైలు ఆపాలని కోరారు. విద్యాపరంగా ఉద్యోగపరంగా వ్యాపార పరంగా అన్ని రకాల ప్రజలు ఇక్కడ నుంచి ప్రయాణం చేస్తారని ఈ ప్రాంత ప్రజల కోరిక వందే భారత్ రైలును తప్పనిసరిగా ఆపాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

4న చలో ఢిల్లీ : కెవిపిఎస్

ప్రజాశక్తి - వెలుగోడు

డిసెంబర్ 4న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్ కోరారు. శుక్రవారం వెలుగోడు గ్రామంలో వారు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో దళితుల సమస్యలు పరిష్కరించకపోవడం వలన కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర పేరుతో రాష్ట్రమంతా కెవిపిఎస్ దళితుల సమస్యలను తెలుసుకొని విజయవాడలో దళితుల సమస్యలు పరిష్కరించాలని మహా ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. దళితులతో సంతకాల సేకరించి ఆ సంతకాలను రాష్ట్రపతికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక బడ్జెట్ వారికే ఖర్చు పెట్టాలని, ఎస్సీ ఎస్టీ హత్యాచార నిరోధక చట్టాన్ని నీరు కార్చే 41 సిఆర్‌పిసి సెక్షన్‌ను రద్దు చేయాలని, ఎస్సీ ఎస్టీ మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని, కోనేరు రంగారావు సిఫారసులు అమలు చేయాలన్నారు. డప్పు కళాకారులకు, చర్మకారులకు రూ.5000 పెన్షన్, జీవిత బీమా, బ్యాగరీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి వారికి ఐడి కార్డులు ఇచ్చి రూ.5000 పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లకై ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు కిషోర్, కృష్ణ, వెంకటేశ్వర్లు, నరసింహ, చిన్న పుల్లయ్య, వెంకటస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

19న ధార్మిక సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల

19వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు అంటికోట మస్జిద్ ప్రాంగణంలో ధార్మిక సమావేశం ఏర్పాటు చేసినట్లు నంద్యాల జమాఅతె ఇస్లామి హింద్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ తెలిపారు. ఈ సంధర్భంగా స్థానిక జమాఅత్ కార్యాలయంలో శుక్రవారం ఆహ్వాన పత్రం విడుదల చేస్తూ, "ఆదర్శమూర్తి ముహమ్మద్(స)" అన్న అంశంపై జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ తెలుగులోను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ కరీముద్దీన్ ఉర్దూలో ప్రసంగిస్తారని సమ్మద్ తెలుపారు. ప్రవచనాలు వినుటకు ప్రజలు ఇతోధికంగా తరలిరావాలని సమద్ ఆహ్వానించారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాటు కలదని,ఈ సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎన్ ఎండి ఫరూఖ్, జనాబ్ ఇసాక్ బాషా, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారు డి. హెచ్. హబీబుల్లాహ్, ఏపి ఉర్దూ అకాడమీ మాజీ ఛైర్మన్ డా.ఎస్.ఎండి నౌమాన్, ప్రముఖ న్యాయవాదులు వి. రామచంద్రరావు, నూర్ అహమ్మద్ మదని తదితరులు పాల్గొంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో హఫీజ్ ముహమ్మద్ షోయబ్ జమాన్, వి సలీం,ముహమ్మద్ షఫీ, అబ్దుల్ అలీం, ముహమ్మద్ ఫయాజ్, యూనూస్ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డు జ్ఞానాపురం నందు 177వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, వార్డు ఇంచార్జ్ ఎద్దు రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించారు. సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కలాం బాష, సచివాలయ కన్వీనర్ దాల్మిల్ అమీర్, వైసిపి నాయకులు దేవ నగర్ బాషా, భాస్కర్ రెడ్డి అనిల్ అమృత రాజ్, రామచంద్రుడు, కారు రవికుమార్, వైసిపి నాయకులు ఎద్దుల ప్రవీణ్ ,ప్రసన్న జీవన్,సంజీవ,పాల్, వాలంటీర్లు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మండలంలోని నగళ్లపాడు, రాజోలి, మల్లెవేముల గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొని ఇటింటికి తిరిగి పథకాలను వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు సర్పంచ్లు దస్తగిరి రెడ్డి,ఈదుల సరోజమ్మ,ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, చిన్నరాముడు,జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,బ్రహ్మానందరెడ్డి, మల్లారెడ్డి,స్వామిరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,ఎంపీటీసి లు పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి,జేసిఎస్ మండల కన్వీనర్ వెంకటరామిరెడ్డి,సింగల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,వైసీపీ నాయకులు శివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం : టిడిపి

కరపత్రాలను అందజేస్తున్న మన్నె సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -ప్యాపిలి

రాష్ట్రంలో దోపిడీలు, భూకబ్జాలు, మాఫియా, రౌడీ మూకలే తప్ప అభివృద్ధి శూన్యం అని డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మన్నె సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటేలో భాగంగా ప్యాపిలి పట్టణంలోని 4వ వార్డ్‌లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. టిడిపి మిని మేనీఫెస్టోను క్లుప్తంగా వివరించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని, యువత చెడు అలవాట్లకు బానిసై నాశనం అవుతున్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును రాష్ట్రంలో గెలిపించు కోవాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న సుంకయ్య, రాంమోహన్ యాదవ్, పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, నాగేంద్ర, కొంగన పల్లె మధు,ప్రిన్సిపాల్ మధు,రామాంజినేయులు, మల్లి కార్జున,ఖాజా పీర్,రజిని,బాలి రెడ్డి,ప్రతాప్,నరేంద్ర, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం పేర్కొన్నారు. పట్టణంలోని బూత్ నంబర్ 83, 96 కరెంట్ ఆఫీస్, రిజిస్టర్ ఆఫీస్ ఏరియాలలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు సలాం, టిడిపి నాయకులు చంద్రారెడ్డి, జాకీర్ హుస్సేన్‌లు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేస్తూ పథకాల గురించి వివరించారు. **ఆళ్లగడ్డ :** రాష్ట్రంలో అరాచక పాలన పోవాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోని అహోబిలం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని రెండవ రోజు తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉండేందుకు ప్రజాహిత మినీ మేనిఫెస్టోను టిడిపి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పగడాల గంగాధర్, ఎం వి ప్రసాద్ ,వీరభద్రుడు, బాలా చారి, సుధాకర్ రెడ్డి, వేలంగి రాజీ, రామంజి , బద్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో కార్మికులుగా నాపరాతి యజమానులు : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల నాపరాతి గని యజమానులు కార్మికులుగా మారుతున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల నాపరాతి పరిశ్రమ కుదేలైందన్నారు. టిడిపి పాలనలో ఒక చదరపు అడుగు కు రాయల్టీ ఎనిమిది రూపాయల నుండి ఐదు రూపాయలకు తగ్గించడం జరిగిందన్నారు. 30 శాతం ఉన్న డిఎంఎఫ్‌ను 10 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చదరపు అడుగుకు రాయల్టీని ఐదు రూపాయల నుండి ఆరు రూపాయలకు పెంచడం జరిగిందని, హెక్టారుకు డెడ్ రెంట్ సంవత్సరానికి 52వేలకు పెంచడం జరిగిం దన్నారు. భారీ పరిశ్రమలకు వర్తించే కండిషన్లను నాపరాతి పరిశ్రమకు పెట్టడం సరికాదన్నారు. భారీ పరిశ్రమలకు సిఎఫ్ఓ, సిఎఫ్ఈ, ఈసీ మైనింగ్ ప్లాన్ పెట్టడం వల్ల గనుల యజమానులు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నికలకు ముందు కొమిగుండ్ల మండలంలోని బందర్ల పల్లె వద్ద ఉన్న రాయల్టీ చెక్ పోస్ట్‌ను ఎత్తివేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించు కోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో గని యజమానులతో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లతో సమావేశాలు నిర్వహిస్తున్నామని గని యజమానులను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శి ంచారు. బనగానపల్లెకు వస్తున్న మంత్రులు గతంలో ఏ విధంగా రేట్లు ఉన్నాయో ఆ రేట్లను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాపరాతి పరిశ్రమకు విద్యుత్ చార్జీలను తగ్గించాలని రాయల్టీలను, డెడ్ రేట్ ను తగ్గించి గని యజమానులను, కార్మికులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీసీ కోరారు.

పేదల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎంపిపి, చైర్మన్

జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ బుగ్గన, చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రతి పేదవాడి అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు స్థానిక దుర్గాపేట సమీపంలో గల బలపాలపల్లి రోడ్డు లోని సిద్ధప్ప గుడి దగ్గర వైసిపి జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బేతంచర్ల పట్టణం ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మురళి కృష్ణ, సచివాలయ కన్వీనర్ భాస్కర్, మద్దిలేటి, ఎద్దులన్నా, రామ నాయుడు, శ్రీనివాసులు, బొట్టే గాళ్ళ మద్దిలేటి, గోపి, జల్ల శ్రీనివాసులు, మసి మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రారంభం

- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ఆర్ డబ్ల్యూ ఎస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల పట్టణం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో నూతనంగా ఒక కోటి పది లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని నంద్యాల శాసన సభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యాలయం కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేయడం జరిగిందని, నంద్యాల మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన నీటి సమస్య ఈ కార్యాలయ నిర్వహణ ద్వారా పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రజల తాగునీటి అవసరాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఈ ఆర్డబ్ల్యుఎస్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన పరిస్థితిని గమనించి, కార్యాలయాన్ని 1 కోటి 10లక్షల రూపాయల వ్యయంతో రూపొందించడం జరిగిందన్నారు. నంద్యాల మండల పరిధిలోని గ్రామాలకు అత్యంత ప్రధాన అవసరాలు తీర్చే ఈ కార్యాలయం ప్రజలకు, సంభందిత అధికారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామాన్ మార్కెఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావళి, కౌన్సిలర్స్ కలాం బాష, వైసిపి నాయకులు అనిల్ అమృతరాజ్ సోమశేఖర్ రెడ్డి, పార్థుడు ,నాగరాజు, అప్పన్న గౌడ్, రాజా జలీల్, అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ చివరికి కెసికి నీరు ఇవ్వాలి

- మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - పగిడ్యాల

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి పుల్యాల దివ్య

డిసెంబర్ చివరి వరకు కేసికి నీరు ఇవ్వాలని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయడం జరిగిందని జెడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండలంలో రేషన్ షాపులో రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని, పగిడ్యాల సంత మార్కెట్ సమీపాన ఉన్న ఎంపీపీ పాఠశాలలో విద్యుత్ ట్రాన్స్ఫారం ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి పేర్కొన్నారు. జెడ్పిటిసి పుల్లాల దివ్య మాట్లాడుతూ పగిడ్యాల మోడల్ స్కూల్లో అదనపు గదుల నిర్మాణం కోసం వ్యాయామ ఉపాధ్యాయుడు నియామకం కోసం జిల్లా జడ్పీ సమావేశం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కరువు మండలంగా ప్రకటి ంచిందని, మండలభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ కు సూచించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసినట్టుగా పనిచేసే ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే అధికారికి సమస్యలపై వినతులు

వినతి పత్రం ఇస్తున్న ఎం.పి.పి

ప్రజాశక్తి - పాణ్యం

డోన్ – నంద్యాల రైల్వే రెండవ లైన్ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి వచ్చిన డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ – కన్స్ట్రక్షన్‌ను పాణ్యం గ్రామ రైతులు డోన్ – నంద్యాల రైల్వే లైన్ లోని బ్రిడ్జి దగ్గర కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. డోన్ – నంద్యాల రైల్వే లైన్‌లోని లెవెల్ క్రాసింగ్ మూసివేయడం వల్ల రస్తాను కోల్పోవడం జరిగిందని, దీనికారణంగా 250 ఎకరాల పొలాలకు పోవు రస్తా మూసుకొనిపోయినదని, 85 మంది రైతులు ఈ పొలాలపై ఆదరాపడిన 500 మంది వ్యవసాయ కూలీల జీవనం ప్రశ్నార్థకంగా మారిందనీ, పొలాలు బీడు భూములుగా మారతాయనిఅధికారికి రైతులు వివరించారు. ఇప్పుడు రెండవ లైన్ రావడంతో సమస్య ఇంకా జటిలం అవుతుందని, జీవనాధారం లేక రైతులు , కూలీలు రోడ్డున పడవలసిన పరిస్తితి ఏర్పడిందని వాపోయారు. మూసివేసిన లెవెల్ క్రాసింగ్ స్థానంలో ఆర్ఒబి/ఆర్‌యుబిని నిర్మించాలని, పాణ్యంలో అన్ని రకాల ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలని, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల పక్షాన ప్రొఫెసర్ గోపి కృష్ణా రావు వినతి పత్రం సమర్పించారు. ఎం.పి.పి. హుస్సేన్ బీ,వైసిపి నాయకులు చందమామ బాబు,రాజ, కృష్ణా రెడ్డి, చాంద్ బాషా,రాఘవేంద్ర రెడ్డి,అ ంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు గోపి నాగేశ్వర రావు,బద్ర,మానవతా సంఘం తరుపున సుధాకర్,సీఐటీయూ నాయకులు భాస్కర్ ,ప్రతాప్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై రైల్వే జీఎంకు సిపిఎం వినతి

నంద్యాలలోని రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు వెంటనే పూర్తి చేయాలని కర్నూలు నంద్యాల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని, కర్నూలు విజయవాడ ఎక్స్ప్రెస్ రైలు నడపాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి వి. బాల వెంకట్, సిఐటియు మండల కార్యదర్శి కే. భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్, నాయకులు సతీష్, రాజాలతో కలిసి వారు మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్ నుండి ప్యాసింజర్ రైళ్ళు, డబ్లింగ్ పనులు త్వరగా పూర్తిచేసి నూనెపల్లె, బొమ్మలసత్రం సత్రం ప్రాంతాల్లో అండర్ పాసు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కొత్త రైళ్లు ఈ ప్రాంతం గుండా వేయాలని అన్నారు. నంద్యాల రైల్వే స్టేషన్లో ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని, డబ్లింగ్ పనులు త్వరగా పూర్తి చేసి నంద్యాల –విజయవాడ ప్రయాణ సమయాన్ని తగ్గించాలని, నంద్యాల మీదుగా ప్యాసింజర్ రైళ్లు విజయవాడ– గుంతకల్ మధ్యల నడపాలని, నంద్యాల నుండి హైదరాబాద్‌కు రద్దీ ఎక్కువగా ఉన్నందున మరొక ఎక్స్ప్రెస్ రైలు వేయాలని, నంద్యాల మీదుగా ముంబైకి రైలు వేయాలని కర్నూల్ నుండి విజయవాడకు రెగ్యులర్ ఎక్స్ప్రెస్ రైలు నడపాలని, కర్నూలు నుండి నంద్యాలకు రైల్వే లైన్ నిర్మించాలని, అలాగే శ్రీశైలానికి రైల్వే లైను నిర్మించాలని నంద్యాలలో ఉన్న నూనెపల్లె రైల్వే గేటు దగ్గర అండర్ పాస్ బ్రిడ్జిని వెడల్పుగా నిర్మించాలని, అలాగే మూల సాగరం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని నంద్యాల రైల్వే స్టేషన్లో ప్లాట్ఫారంల సంఖ్య పెంచుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్ నిర్మించాలన్నారు. వృద్ధులు వికలాంగులు మహిళలు మెట్లు ఎక్కి దిగేందుకు చాలా అసౌకర్యంగా ఉన్నందున ఈ సౌకర్యాన్ని కల్పించాలని అలాగే పాణ్యంలో అన్ని రైళ్లు ఆగేలాగా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కాకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు తెలిపారు.

రైల్వే సమస్యలపై రైల్వే జీఎంకు వినతి ఇస్తున్న సిపిఎం నేతలు

సమస్యలను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా కట్ చేసిన కొండపేట ప్రాంతాలకు పాతపేటకు మాలిక్ బాబాకు పాత బుగ్గకు పోయే రోడ్డు కట్ చేయడం మూలంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వాటిని తొందరగా నిర్మించి డ్రైనేజీ వ్యవస్థను పెద్ద డ్రైన్‌కు కలపాలని, అలాగే రోడ్డు వేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ రైల్వే అధికారులకు,కాంట్రాక్టర్లకు ఆదేశించారు. శుక్రవారం డోన్ పట్టణంలోని ఏడవ వార్డు నందు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పర్యటించారు. వార్డులో స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ కొండపేట ప్రాంత ప్రజలు,పట్టణ ప్రాంత ప్రజలు మాలిక్ బాబా గుడికి,పాతబుగ్గకు వెళ్లే రహదారిలో రైల్వే డబల్ లైన్ పనులు చేపడుతుండడం వలన ప్రజలకు డ్రైనేజీ సమస్య,రోడ్డు సమస్య ఇబ్బందిగా ఏర్పడిందని రైల్వే అధికారులకు కాంట్రాక్టర్లకు తెలిపారు. ప్రజల సమస్యలను దష్టిలో ఉంచుకొని తక్షణమే రైల్వే అధికారులు,కాంట్రాక్టర్లు డ్రైనేజీ సమస్య,రోడ్డు సమస్యను పరిష్కరించి ప్రజలకు యధావిధిగా ఉండే విధంగా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్,మున్సిపల్ డిఈ రసూల్,మున్సిపల్ ఏఈ సురేష్,మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అంజాద్,వైఎస్ఆర్‌పి నాయకులు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పతకం గర్వకారణం

ప్రజాశక్తి - ప్యాపిలి

చైనాలో జరిగిన రోయింగ్ పోటీలలో రజత పతకం గెలుపొంది అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన తమ కళాశాల విద్యార్థి వెంకటనారాయణ గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్ణం అన్నారు. శుక్రవారం వెంకట నారాయణ ను కళాశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతిభను ఏశక్తులు అడ్డుకోలేవని ఆర్థిక సమస్యలు, ప్రతిభ చూపించడానికి అడ్డుకాదని వెంకతనారాయన నిరూపించదని కొనియాడారు. సన్మాన గ్రహీతవెంకటనారాయణ మాట్లాడుతూ నిరంతర కృషితో ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. సైనిక విధుల్లో భాగంగా జరిగిన ప్రమాదంలో కాలికి గాయాలయినా రోయింగ్ నందు శిక్షణ పొంది వివిధ జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొని అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు పొందడానికి కృషి, పట్టుదలయే కారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు రామకష్ణయ్య, సత్యబాబు, నవీన్ ముస్తాక్, నవీనపాటి, వెంకటేశ్వర్లు, వెంకట రమణ, శంకరయ్య, మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకట నారాయణ

మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-డోన్

ఫీల్డ్ అసిస్టెంట్ మార్పుతో ఉపాధి హామీ పనులు ఆగిపోయాయని వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ డోన్ మండలంలోని అతిపెద్ద మేజర్ గ్రామ పంచాయతీ అయిన పెద్ద మల్కాపురంలో వైస్సార్సీపీ ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత గ్రామంలో అధికార పార్టీ నాయకులు జాతీయ గ్రామీన ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ ను మార్పు చేయడం వలన మార్పు చేసిన రోజు నుండి ఇప్పటిదాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జరగడం లేదని అన్నారు. ఈ సంవత్సరం సరియైన సమయంలో వర్షాలు పడక పంటలు ఎండిపోవడం జరిగిందని, రైతులు పెట్టిన పెట్టుబడి రాక అప్పుల్లో మునిగి, పెట్టుబడి అప్పులు తీర్చుకోడానికి రైతులు వ్యవసాయ కూలిలు వలస బాట పతున్నారని, ఈ సంవత్సరమైన అధికారులు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేసి పనులు ప్రారంభించాలని వారు అధికారులను కోరారు. డోన్ కి 12కిలోమీటర్లు దూరంలో ఉన్న మేజర్ పంచాయతీలో 2సంవత్సరాల నుండి ఉపాధి హామీ పనులు జరగలేదని ఎపిడి బాధ్యత లేకుండా సమస్యను గాలికొదిలేయడం బాధాకరం అన్నారు. ప్రజలు పూట గడవక వలసలు పోతున్నారని తక్షణమే సమస్యను పరిష్కారం చేసి ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ఎస్‌సి కాలనీకి కరెంట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - పాణ్యం

నంద్యాల జిల్లా పాణ్యం గ్రామంలో ఎస్సి కాలనీకి కరెంట్ ఇవ్వాలని ఎఐకి కాలనీ వాసులు, తదితరులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత బాకాయిలు 2004 నుండి కాంగ్రెస్ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు యస్.సి.,యస్. టి ప్రజలకు పాత బిల్లులు చెల్లించవద్దని అధికారంలోకి వచ్చినప్పటినుండి ఇప్పటి వరకు కరెంట్ ఉచితంగా ఇస్తామని చెప్పి, ఇప్పుడు పాత బిల్లులు కొంత కట్టిన ప్రతి బిల్లుకు గత 5సంవత్సరాలనుండి ఇప్పటివరకు రసీదులు ఇవ్వకుండా వడ్డీ కిందకు జమ చేసుకుంటున్నామని అధికారులు చెపుతున్నారన్నారు. డబ్బులు కడితేనే కరెంటు ఇస్తామని లేకుంటే లేదని రోజు వంద కుటుంబలలో కరెంటు ఒకేసారి కట్ చేసారు ఇప్పుడు కాలనీలో కరెంటు లేక రోడ్డుమీద ఉన్నాం అన్నారు. తాము కూలి చేసుకుంటే పూటకు గడవని పరిస్థితి లు ఉన్నాయని, కరెంట్ ఇవ్వాలని కోరారు.

కబడ్డీ శిక్షణ శిబిరానికి మెడికల్ కిట్ అందజేత

ప్రజాశక్తి - పగిడ్యాల

ఉమ్మడి కర్నూలు జిల్లా అండర్ 17 బాలుర కబడ్డీ శిక్షణ శిబిరానికి ప్రథమ శిక్ష మెడికల్ కిట్టును గ్రామ పెద్ద బొబ్బింటి నాగేశ్వర్ రెడ్డి పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడారు. క్రీడాకారులకు ఎటువంటి గాయాలైన ప్రథమ చికిత్స చేయడం ఎంతో అవసరమన్నారు. మా పాఠశాల మైదానంలో అండర్ 17 బాలుల కబడ్డీ శిక్షణ శిబిరానికి నాగేశ్వర్ రెడ్డి ప్రథమ చికిత్స మెడికల్ కిట్టును అందచేయడంతో ఆయనను అభినందించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ఇలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ మియ్య, మోహన్ దాస్, పిడి కృష్ణ, క్రీడా శ్రీ తోకల పితాంబ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మెడికల్ కిట్టును అందజేస్తున్న దృశ్యం